క్లుప్తంగా

నిత్యావసర ధరలను నియంత్రించాలి



వినతి పత్రం అందజేస్తున్న భువనేశ్వరి

బైరెడ్డిపల్లె: నిత్యావసర సరుకుల పెరుగుదలను నియంత్రించాలని సీపీఎం జిల్లా నాయకురాలు భువనేశ్వరి అన్నారు. మండలంలోని ఆల్లపల్లె, పెద్దచల్లారగుంట సచివాలయాల్లో అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెరుగుదలతోపాటు నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించి పేద ప్రజలను ఆదుకోవాలన్నారు. దళితులపై, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. సీపీఎం కార్యకర్తలు శివ, సోము పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏడీ శివకుమార్

పుంగనూరు: మారుతున్న కాలపరిస్థితులతోపాటు రైతులు పండించే పంటలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఏడీ శివకుమార్ సూచించారు. మంగళవారం సింగిరిగుంట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ రైతులు పంట పండించడం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు ముందుకు రావాలన్నారు. అలాగే మందుల వినియోగానికి డ్రోన్‌ను, విత్తనాలకు సైతం యంత్రాలను వినియోగించుకోవాలని కోరారు. వీటి ద్వారా పెట్టుబడి తగ్గించుకుని అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. ఏఓ ఫయాజ్, రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ బోధన పటిష్టంగా నిర్వహించాలి

– జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అఫ్సర్‌ఖాన్



ఉర్దూ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ అఫ్సర్‌ఖాన్

పుంగనూరు: మైనార్టీలందరికీ ఉర్దూ బోధనను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అఫ్సర్‌ఖాన్ సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఇస్లాంనగర్‌లో గల జెడ్పీ ఉర్దూ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీని పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులందరూ పాఠశాలలకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఉర్దూ భాషను సులభంగా మాట్లాడడం, రాయడం నేర్చుకునేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులు రాకుండా చర్యలు



లింగాపురంలో యూడీఐడీ రిజిస్ట్రేషన్ పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: అంటువ్యాధులు రాకుండా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మండలంలో ప్రత్యేక పారిశుధ్య పనులను చేపడుతున్నట్లు ఎంపీడీఓ బాలాజి అన్నారు. మంగళవారం లింగాపురం, అమ్మరాజుపల్లి, ముదరంపల్లిలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా దివ్యాంగులకు యూడీఐడీ రిజిస్ట్రేషన్, అమ్మరాజుపల్లి హౌస్‌హోల్డ్ జియో ట్రాకింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల జారీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని హెచ్ఎం, సచివాలయ ఉద్యోగులు, పీఎస్‌లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ ద్వారా ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీఓ సూచించారు. ఎంఈఓ గోపాల్ రెడ్డి, పంచాయతీ విస్తరణ అధికారి శారదాదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు స్త్రీశక్తి భవనంలో సభ

వి.కోట: నేడు 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని స్త్రీశక్తి భవనంలో ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఏపీఓ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 18వ విడత సామాజిక తనిఖీ నిర్వహణకు సంబంధించి బహిరంగ సభ నిర్వహణ ఉంటుందన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 మధ్య కాలంలో జరిగిన పనులపై ఈనెల 1 తేదీ నుంచి 12 తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు, రైతులు, స్వయం సహాయక సభ్యులు హాజరు కావాలని ఆయన సూచించారు.

వన్యప్రాణుల వేట

- అటవీ ప్రాంతాల్లో వేటగాళ్ల హల్‌చల్
- జింకలు, కుందేళ్లు టార్గెట్
- నిద్రావస్థలో అటవీశాఖ
- యథేచ్ఛగా మాంసం విక్రయాలు

చౌడేపల్లె: పల్లెలకు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులకు రక్షణ కొరవడింది. పగలు రాత్రి తేడా లేకుండా వేటగాళ్లు నాటుతుపాకీ, ఉర్లు, నల్ల ఉంటల ద్వారా వన్యమృగాలను మట్టుబెడుతున్నారు. వారి బారినపడిన వన్యమృగాలను దర్జాగా పల్లెలు, పట్టణాల్లో విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో వన్య మృగాలను వేటాడేందుకు వెళ్లి వేటగాళ్ల తూటాలకు నిమ్మనపల్లె మండలం బాలేపల్లెకు చెందిన శ్రీరాములు (38) మృతిచెందిన సంఘటన తెలిసిందే. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా వేటగాళ్లు దర్జాగా అటవీ ప్రాంతాల్లోకి ప్రవేశించి సరికొత్త ఆలోచనలతో సులభంగా కుందేళ్లు, జింకలు, దుప్పులు, అడవిపందులు, కంజులు, యంటవలను మట్టుబెడుతున్నారు. వేటగాళ్ల సమాచారం తెలిసినా అటవీశాఖ అధికారులు, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ జంతువుల మాంసాన్ని సైతం వారికే విందుభోజనాలుగా ఏర్పాటుచేయడం, వారితో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తుండడంతో అధికారుల అండతోనే వేటగాళ్లు హద్దులు మీరి వన్యమృగాల ప్రాణాలు తీస్తున్నారని స్థానికంగా చర్చనీయాశంగా మారింది. మండలంలోని పెద్దకొండామర్రి, నాగిరెడ్డిపల్లె, మాదంవారిపల్లె, షికారిపాళ్యం, సీజేఎఫ్ఎస్ కాలనీ, బండమీదపల్లె, దుర్గసముద్రం, పక్షిరాజపురం, పాలెంపల్లె, గాజులవారిపల్లె, పరికిదొన, సామిరెడ్డిపల్లె, సింగిరిగుంట, పందిళ్లపల్లె, చుక్కావారిపల్లె, చారాల, ముదిరెడ్డిపల్లె, కాటిపేరి, కాగతి ప్రాంతాల్లో వేటగాళ్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అడవులలో వేటగాళ్ల బారి నుంచి తప్పించుకున్న అటవీ జంతువులు ఏకంగా జనారణ్యంలోకి పరుగులు తీస్తున్నాయి. గతంలో బోయకొండ పరిసర ప్రాంతంలో ఓ దుప్పి వేటగాళ్ల దాడిలో తూటాలకు బలైనట్లు రహస్య సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో రహస్యంగా వీరి వేట వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఇలాంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నా అటవీశాఖ అధికారులు, పోలీసులు కానీ పట్టించుకోకపోవడంతోపాటు ఆ దిశగా విచారణ సైతం చేపట్టకపోవడం గమనార్హం. వన్యప్రాణులను కాపాడుకోవడానికి ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా బూడిదలో పోసిన పన్నీరు సామెతలా మారింది. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. అటవీ జంతువులను వేటగాళ్ల నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.





చౌడేపల్లెలో వేటగాళ్ల ఉచ్చులో పడి విక్రయానికి తీసుకొచ్చిన కుందేలు, యంటవ (ఫైల్)



పెద్దయల్లకుంట్ల వద్ద లేవలేని స్థితిలో పడి ఉన్న నెమలి (ఫైల్)

కిలో మాంసం రూ.200కే విక్రయం..

అడవిపందుల మాంసాన్ని కిలో రూ.200 చొప్పున దర్జాగా విక్రయిస్తున్నారు. విక్రయాలపై అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చినా మామూళ్లు తీసుకొని వారిపై ఎలాంటి చర్యలు తీసుకుపోగా దొరికినంతా సొమ్ము చేసుకొని పబ్బం గడుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాటు తుపాకీలతోపాటు పంటలకు కరెంటు తీగల ద్వారా అడవి పందులను చంపి విక్రయిస్తున్నారు. పెద్దయల్లకుంట్ల, చెడుగుట్లపల్లె, యర్రపల్లె, బిల్లేరు ప్రాంతంలో నెమళ్లను సైతం వదలడంలేదు. వీటిపై అటవీశాఖ అధికారులు స్పందించడంలేదు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

“ వేట గురించి మా దృష్టికి తీసుకొస్తే కఠినచర్యలు తీసుకుంటాం. వన్యమృగాలను వేటాడడం, అటవీ మాంసం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరం. వేటకు పాల్పడినా, అటవీ మాంసం విక్రయించినా ఎవరైనా సరే ఉపేక్షించం.

శ్రీరాములు, ఫారెస్ట్ రేంజర్, పుంగనూరు

అభ్యంతరాలుంటే తెలపండి



మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ గిరి

పలమనేరు: పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ఈనెల 23న నిర్వహించే నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని ఇరిగేషన్ ఈఈ ఈఎన్‌సీ గిరి సూచించారు. ఆమేరకు పట్టణ సమీపంలోని ఆర్డీఓ సమావేశ మందిరంలో పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలోని ఇరిగేషన్ అధికారులు, ఎన్నికల పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఈ దఫా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఇందులోభాగంగా ఆయా మండలాల రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఓటర్ల జాబితాను రూపొందించారని తెలిపారు. ఇందులో ఏదేనీ అభ్యంతరాలుంటే నేడు స్థానిక కార్యాలయాల్లో తెలుపవచ్చునని పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 23 దాకా ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇరిగేషన్ డీఈ ప్రసాద్, ఏఈ, జేఈ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కోగిలేరులో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా వ్యవసాయాధికారి రఖీబా మాట్లాడుతూ ప్రస్తుతం సబ్సిడీ బిందు సేద్యం పరికరాలకు రిజిస్ట్రేషన్ జరుగుతోందని కావాల్సిన రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పచ్చిరొట్ట విత్తనాలు వినియోగించుకుని ఎరువుల ఖర్చు తగ్గించుకోవాలని చెప్పారు. అసిస్టెంటు సెరికల్చర్ అధికారి జీవీఆర్ చౌదరి పట్టు పరిశ్రమ శాఖలో ఉన్న పథకాలు, సబ్సిడీ వివరాలను తెలియజేశారు. పశువుల్లో లంపిస్కిన్ వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి వినితకుమారి అన్నారు. అఖిల భారత పశుగణనకు రైతులు సహకరించాలని ఆమె కోరారు. సర్పంచ్ రమేష్‌బాబు, వీఎస్ఏ నరేష్, వీహెచ్ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్క్రీనింగ్ పరీక్షలు



స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: తొలిదశలోనే కేన్సర్ మహమ్మారిని అరికట్టడానికి ఈనెల 14 నుంచి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం కాగతి గ్రామంలో 104 వాహనంలో వైద్యసేవలను అందించారు. ఆయన మాట్లాడుతూ అధికశాతం నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌లు గుర్తిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ చివర దశలో గుర్తించడం వలన చికిత్స అందించినా ఫలితం లేకపోతోందన్నారు. ప్రభుత్వం కేన్సర్ నివారణకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ ఐదు గృహాల్లోని 30 ఏళ్లకు పైబడిన వారిందరికీ సచివాలయంలోనే ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ హరనాథ్, ఎంఎల్‌హెచ్‌పీ రోజా, ఏఎన్ఎం సరిత పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా సహకరించండి



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

పలమనేరు: బాధ్యతాయుతంగా పోలీసులకు సహకరించి అవసరమైన సమాచారాన్ని అందివ్వాలని ఆటోడ్రైవర్లను డీఎస్పీ డేగల ప్రభాకర్ కోరారు. స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణంలోని ఆటోవాలాలతో మంగళవారం ఆయన శాంతిభద్రతలపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాల వివరాలు ఎక్కువగా పోలీసుల కంటే మీకే తెలుస్తాయన్నారు.మీరు బాధ్యతాయుతంగా పోలీసులకు సహకరించి అవసరమైన సమాచారాన్ని అందివ్వాలని సూచించారు. సీఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ పాల్గొన్నారు.

నకిలీ పట్టా సృష్టించి భూమి హాంఫట్!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కొందరు నకిలీ పత్రాలు సృష్టించి తమ పూర్వీకుల భూమికి 2021లో అక్రమంగా రెవెన్యూ రికార్డులు సృష్టించారని వి.కోట మండలం గంధరమాకులపల్లెకి చెందిన నారాయణప్ప, రామప్ప ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తరతరాలుగా వారసత్వంగా సంక్రమించిన 4.90 సెంట్ల భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీ సైతం తమ పేరిట ఉందన్నారు. 2021లో రికార్డులు తారుమారు చేసి సంబంధం లేని వ్యక్తుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసారని, ఇది తమ దృష్టికి రావడంతో వెంటనే తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం ఇతర వ్యక్తుల పేర్లే ఉన్నాయని, జిల్లా కలెక్టర్ స్పందించి తమ భూమిని సర్వే చేయించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో భూ హక్కుదారులు వెంకటస్వామి, వీరప్ప, ఈశ్వర పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

–ఆశీర్వదించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నూతన వధూవరులను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. చెంచెంరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత అమరనాథరెడ్డి కుమార్తె లక్ష్మిని అదే గ్రామానికి వైఎస్సార్‌సీపీ నేత సురేంద్రరెడ్డి కుమారుడు శివప్రసాద్‌రెడ్డికి టీటీడీ కల్యాణ మండపంలో వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెళ్లికి హాజరైన వారిలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.

15న జాబ్‌మేళా

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లి వద్ద గల మైనారిటీ ఐటీఐ కళాశాలలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం నైపుణ్యాధికారి గుణశేఖర్‌రెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగి, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతి, యువకులు ఉదయం 10 గంటలకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

వి.కోట: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ అరుణశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో ఆమె పేర్కొంటూ మండలంలోని గాండ్లపల్లి, పాపేపల్లి పరిధిలోని అంగవాడీ కేంద్రాల్లో సహాయకురాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అరత్హకల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే గ్రామానికి చెందిన వివాహిత పదో తరగతి పాస్ అయిన వారు దీనికి అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో నేటి నుంచి, 22 తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని ప్రకటనలో కోరారు.

సమావేశాలను నిర్వహించండి



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: క్రమం తప్పకుండా 90 రోజులకు ఒకసారి జరిగే ఎస్సీ, ఎస్టీ మానిటరీ కమిటీ సమావేశం నిర్వహించాలని ఎంపీపీ యువరాజ్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల ఆఖరులోపు ఎస్సీ, ఎస్టీ సమావేశం నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఎంపీడీఓ, ఏఓ, ఏపీఓలకు మండల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్ఆర్‌ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల ఎస్సీ, ఎస్టీ మానిటరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎంలపై చర్యలు తీసుకోండి



పీడీకి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

రొంపిచెర్ల: హైకోర్టు ఆదేశించినా సంఘమిత్రలను విధుల్లోకి తీసుకోని ఏపీఎంలపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదాస్ లోకేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం డీఆర్‌డీఏ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ పీడీ రవికుమార్‌నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి తప్పు లేకున్నా రొంపిచెర్ల మండలంలో ఏడుగురు, పులిచెర్ల మండలంలో మరో ఏడుగురు సంఘమిత్రలను తొలగించారని గుర్తు చేశారు. దీనిపై సంఘమిత్రలు హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని, వారిని విధుల్లోకి తీసుకోకపోవడం భావ్యం కాదన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న సంఘమిత్రలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదన్నారు. తొలగించిన సంఘమిత్రలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రొంపిచెర్ల, పులిచెర్ల ఏపీఎంలు హరినాథ, రమేష్ నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘమిత్రలు గీత, సుధారాణి, రష్యాబేగం, సుబ్బమ్మ, ప్రమీల, పర్విన్, సావిత్రి, వి.షానాజ్, సతేమ, ముబీనా, జగదీశ్వరి, బి.షానాజ్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి

బైరెడ్డిపల్లె: మండలంలోని దాసార్లపల్లెలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం అనుమతి ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.నాగరాజు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలియజేసి ఆర్ఐ రామమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దాసార్లపల్లెలో ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుండగా అనుమతి లేదంటూ అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు. అధికారులు స్పందించి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు దామోదరం, నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర, డీహెచ్‌పీఎస్ నేత రఘు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాదర్బార్

కుప్పం: నియోజకవర్గంలో ప్రతి పంచాయతీలోనూ కడా ఆధ్వర్యంలో ప్రజాదర్బార్‌లో భాగంగా మన పంచాయతీ వద్దకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ నియోజకవర్గంలోని 26 ప్రభుత్వ శాఖలతో కలసి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మొదటగా కుప్పం మండలం కంగుంది పంచాయతీలో ప్రారంభిస్తారు. ప్రతి బుధవారం నియోజకవర్గంలోని ఒక గ్రామపంచాయతీలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కడా పీడీ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. అనంతరం పంచాయతీలో క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఆగని ఏనుగుల దాడులు



గొరిశెట్టివారిపల్లె వద్ద ఆరబెట్టిన వరి గింజలను తినేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో నెల రోజులుగా ఎక్కడో ఒక చోట ఏనుగులు పంట పొలాలపై దాడులు చేస్తూనే ఉన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎక్కడా లేని విధంగా పులిచెర్ల మండలంలోనే ఈ ఏనుగుల సంచారం అధికంగా ఉంది. సోమవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు మండలంలోని బెస్తపల్లె, గొరిశెట్టి వారిపల్లెల్లో పంటలపై ఏనుగులు దాడి చేసి చేతికొచ్చిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. కోత కోసి పొలాల్లో ఆరబెట్టిన వడ్లను తినేశాయి. గొరిశెట్టివారిపల్లెలో రైతు ప్రకాష్ పండించిన వరి పంటను తొక్కేశాయి. నేలపై ఆరబెట్టిన వడ్లను 20 బస్తాల ధాన్యాన్ని చిందర వందర చేసి తినేశాయి. దీంతో ఆ రైతులు చేతికొచ్చిన పంటను పోగొట్టుకున్నారు. ఇలా ప్రతిరోజూ మండలంలో తిష్ట వేసిన ఏనుగులు ఏదో ఒక గ్రామంలో పంటలపై దాడి చేస్తూనే ఉన్నాయి. అధికారులు స్పందించి ఏనుగుల బారినుంచి పంటలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తరిగిపోతున్న చెరువు మట్టి

–పట్టించుకోని అధికారులు



జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

గంగవరం: మండలంలో కొంతమంది అక్రమార్కులు మట్టిదందాకు పాల్పడుతూ చెరువు మట్టిని పూర్తిగా ఖాళీ చేస్తున్నారు. యథేచ్ఛగా జేసీబీతో మట్టి తోడి రియల్టర్లు తమ వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు. ఇలా అక్రమార్కుల చేతిలో పడి చెరువు మట్టి పూర్తిగా తరిగిపోతుంది. మండలంలో మబ్బువారిపేట సమీపంలోని చరువులో గత నాలుగు రోజులుగా జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలించకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని ఉల్లంఘించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలే తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా చెరువుల్లో చుక్క నీరు లేక ఎడారులను తలపిస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో చెరువుల్లో కాస్తో కూస్తో ఉన్న నీరు నిల్వకుండా గుంతల మయం చేయడం ఏంటని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని మట్టి తవ్వకాలు ఆపాలని స్థానికులు కోరుతున్నారు.